# యజ్ఞం తర్వాత...

చందు సుబ్బారావు

ఆన 1966వ సంవత్సరం జనవరి యిరవై నాలుగో తేదీన సుందర పాలెం గ్రామ కాపురస్తుడు హరిజన కులస్తుడు అయిన కాంగ్రేపు అప్పలరాముడు కుమార్డు సీతా రాముడు తన గృహ విషయములలో కలిగిన కలహములవల్లనూ, ఋణ బాధల వల్లనూ మతిస్థిమితము లేనివాడై ఎనిమిదేళ్ళ సొంత కుమార్డు పగిడయ్యను దారుణముగా నరికి చంపినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైనది గాన తగు చర్య తీసుకొనవలసినదిగా కొరడమైనది" అని మున్సబునాయుడు పోలీసు రిపోర్టిచ్చాడు.

విచారణ కోసం వచ్చిన కానిస్టేబుల్ తిన్నగా శ్రీరాములు నాయుడు యింటికి వెళ్ళి ఆయన చెప్పినది విని, విన్నది రాసుకుని, సీతారాముడు పరారీలో ఉన్నట్లుగా ప్రపంచానికి తెలియచెప్పాడు.

అది జరిగి మూడేళ్ళయింది.

చుట్టు ప్రక్కల గ్రామాల్లోని ప్రజల మనస్సుల్లో ఆ విషయం యింకా 'పచ్చిపుండు'లా మెదుల్తూనే వుంది.

ఆ సంఘటన మీద ఒకాయన కథ గట్టి పత్రికల్లో వేసాడట. అది చదివిన వాళ్ళు అనేక మంది సుందరపాలెం వచ్చి పోతుండే వారు.

ముందుగా పంచాయితీ జరిగిన మండపాన్ని చూట్టానికి వెళ్ళేవాళ్ళు. ఇపుడా మండపం చుట్టూ గడ్డి మొలిచింది. మండపం అరుగు బీటలు విచ్చింది. అందులో నుంచి పక్షులు వదిలిన విత్తనాలు మొలకెత్తుతున్నాయి. ఓ స్తంభం విరిగి పై కప్పు వో ప్రక్కకు వొరిగింది. ఇపుడక్కడ పంచాయితీలు నిలిచిపోయాయి. పగలు పిల్లలు నాలుగు స్తంభాలాట, దాడి, పులిజూదం ఆడుకుంటుంటారు. రాత్రిళ్ళు అడుక్కునే ముసిలాడొకడు నిద్ర పోతుంటాడు.

'నిద్రలో అతన్నో కుర్రవాడొచ్చి పలక రిస్తాడట. ఇద్దరూ కలిసి మండపం చుట్టూ తిరిగుతూ ఆడుకుంటారట. తెల్లవారుతుండగా ఆ కుర్రవాడు నాలుగు ముక్కలై ఊరి శ్మశానం వేపు వెళ్ళిపోతాడట". అలా అని ఆ ఊళ్ళో పుకారు బయలుదేరింది. దరిమిలా పొద్దు వాలితే చాలు. అటు ప్రక్కల చీమ చిటుక్కు మనటం లేదు.

అది జరిగిన మరునాటి నుంచీ అప్పల రాముడు మంచమెక్కాడు. మూడ్రోజుల పాటు పచ్చి మంచినీళ్ళు ముట్టలేదు. ఇంట్లో ఎవరూ పొయ్యిరాజెయ్యలేదు. ఇరుగు పొరుగు వాళ్ళు వండి యింత తెచ్చిపెట్టేరు. వీళ్ళ శ్రమ ఎంత కాలం తింటామని నాలుగోరోజున ముసలమ్మ తానే లేచి కుండలో బియ్యం కడిగింది. ముసలాయన చేత కొడుకులూ కోడళ్ళూ బలవంతాన రెండు గుక్కలు చోడ జావ త్రాగించారు.

సీతారాముడేమైపోయాడో తెలియ లేదు. వారం గడిచాక ఒనుకుల్లో చెట్టుక్రింద పడుకున్నాడని తెలిసి పల్లెలోని కుర్రవాళ్ళెళ్ళి తీసుకొచ్చారు. బలవంతాన 'టీ' నీళ్ళు త్రాగించారు. అనక చావిట్లోకి పోయి గేదెల మధ్య పడుకున్నాడు. అప్పట్నుంచీ దాదాపు రోజూ అదే వరస.

కుక్కి మంచం నుంచి అప్పల్రాముడు 'సీతారావు దొచ్చాడా' అని అడిగేవాడు. వచ్చాడని యింటి మనుష్యులు జవాబిచ్చేవాళ్ళు.

'ఆడీ జనమకు నాతో మాట్టాడ్డు. ఇంకేం మాట్లాడతాడు. మండపం మింగేసింది. ఆడి కొడుకునూ మింగేసింది. నాకొడుకునూ మింగేసింది" అంటుండేవాడు.

మిగతా కొడుకులు నెల తిరిగే లోపు పనులకు పోవటం ప్రారంభించేరు. ముసలమ్మ రోజూ ఏడుస్తూనే పుల్ల లేరుకొటానికి పోతుంది.

రాను రాను ముసలాయనకు మతి స్థిమితం తగ్గిపోయింది. చూపు మందగించింది. కోడల్ని చూసి 'ముసలమ్మా దప్పిక' అని పిలిచే వాడు. రెండో కొడుకుని చూసి మూడో వాడనుకునేవాడు. ఉన్నట్టుండి 'సీతారావుడు సచ్చిపోనాడు. నేను సంపేశాను' అనేవాడు. మాట పెంచితే స్మారకంలో కొస్తాడని పిల్లలు

'ఎలా చంపేవ్' అనడిగేవాళ్ళు.

'ఏదో కాని మాటన్నాడు. కోపం తట్టు కోలేక పోయాను.

పసిపిల్లవాడి సంగతి మరిచిపోయాడు. తన బిడ్డే తనకు గుర్తొస్తున్నాడు. చావిట్లో నుంచి సీతారావుడు యీ మాటలు వింటున్నా బదులు చెప్పేవాడు కాదు. కాసింత స్థిమితంగా ఉన్నప్పుడు రెండో కొడుకు వెంకటయ్యను పిలిచి,

'అయ్యా, వెంకటప్పా.. సీతారావుడితో సెప్పమాక. గోపన్న బాబు కూడా పేదోడే. ఆయనప్పాయిచ్చేయాల. నేను సచ్చిపోతే నామాట నువ్వు నిలబెట్టాల. సీరావులు బాబు కన్నా అప్పల్రావుడే మాట నిలకడ మణిసనిపించాల. . అనిపించాల ! అనేవాడు.

సీతారావుడు నాలుగడుగుల దూరం లోనే ఉన్నాడన్న గ్రహింపు లేదు. రాను రాను పరిస్థితి క్షీణించింది. మంచంలోనే అప్పల్రావుడి కన్నీ జరిగిపోతున్నాయి. ఆకలి చచ్చిపోయింది. ఒకటీ రెండు కూడా చెప్పలేకపోతున్నాడు. పెడితే తింటున్నాడు కాని ఎవరు పెడుతున్నారో కూడా తెలియటం లేదు. పలవరింతల్లో ....

'సామీ నారాయణ మూర్తీ నరుడి మోసం .. నరుడి దగా.. నరుడి అప్పు.. నారాయణుడు తీర్చవలెనంట .. నా తండ్రీ సీతారావుడూ ఎటుపోయినావు సామీ.. సీతారావుడూ .. ఎల్లిపోయొచ్చీ .. బారియా లేనోడివి.. తిండికి నానా కష్టం పడతావురా



తండ్రీ.. రావణాసురుల వారి దెబ్బ .. సీరావుల వారు మాట తప్పినారు.

అయ్యో .. తీసుకుపోండి.. యమ ధర్మరాజుల వారి బటులొచ్చి తీసుకుపోండి నాయనలారా .. గోపన్న బాబు పిల్లలు గల్లోడు.. నా సామీసీతారావుడూ.. సీతారావుడూ.. సీతా.. సీతా ..” అంటూ ఓ అర్ధ రాత్రిపూట ప్రాణం విడిచేడు. అందరూ నిద్రలో వున్నారు. ఒక్క సీతారావుడే చివరిమాటలు విన్నట్లు ఎవరికీ తెలీదు. తనే చావిట్లోంచి లేచొచ్చి నేల మీద గడ్డివేసి తండ్రిని రెండు చేతుల్తోనూ దింపి పడుకో బెట్టి మళ్ళీ చావిట్లోకి వెళ్ళిపోయాడు. పొద్దున్న లేచి చూసిన పిల్లలు గొల్లు మన్నారు - మునలమ్మ నెత్తీ నోరూ బాదుకుంది. అసలు క్రింది కెవరు దించారని అడగనే లేదు. సీతా రావుడు నోరు మెదపనూ లేదు. వెంకటయ్య చివరి కార్యాలు ముగించాడు.

★ ★ ★

అల్లా ఆ యజ్ఞం జరిగిన మర్నాడే భయ భ్రాంతుడైన గోపన్న కూతురూ మనవల్తో నహా ఏలూరు పెద్ద కొడుకు దగ్గరకు వెళ్ళిపోయాడు. ఊరంతా తన వంకే చూస్తున్నట్లు 'యీ ముదనష్టానికంతకీ యితనే కారణం' అంటున్నట్టూ భావించాడు. చెప్పా చెయ్య కుండా సామాన్లు నాలుగు మూటల్లో సర్దుకొని రాత్రి బస్సుకు శ్రీకాకుళం చేరి ఏలూరు రైలెక్కాడు. ఆరు నెల్లు పోయిం తర్వాత ఉన్న కొంపతెగనమ్మి వచ్చిన సొమ్ము పంపమని పక్కింటి సోమినాయుడికి ఉత్తరం రాసాడు. తదుపరి ఊరుకూడా అతన్ని మర్చిపోయింది.

వెంకటయ్య మాత్రం తన అయ్య మాటలు మర్చిపోలేదు. అనుకోకుండా దున్న కుర్రకు ధర పలికింది. పాతగడ్డివాము కావాలని కరణం గారు కబురు పంపించేడు. కరణానికి పశువుల్లేవు. గడ్డి దేనికా అని వెంకటయ్య వెరిచాడు. సూర్యం బాబుకు ఆ ఏడాది గడ్డి తగిలిందనీ మరి రెణ్ణెల్లకు గాని వరిపంట రానందున పాతగడ్డి కొనటానికి కరణం ద్వారా కబురు పంపాడనీ తెలిసింది. యజ్ఞం తర్వాత అప్పల్రావుడు కుటుంబంతో ముఖా ముఖి లావాదేవీలకు జంకుతున్న సూర్యం బాబు మధ్యవర్తితో అడిగించాడని తెలిసింది. ఎవరైతే నాకేం.. అమ్మ దల్చుకున్నాక.. అనుకున్నాడు వెంకటయ్య. సూర్యంబాబు ఏ గుబుల్లో వున్నాడో. 'బేరం అడగలేదు సరికదా - పలికే ధర కంటే (రెండొందలు) పెచ్చు వేసి పంపించాడు.

ఇంక యిదే సమయమనుకొని ఆ ఏడాది పంట పైరు మీదే తెగనమ్మి వెంకటయ్య ఏలూరు ప్రయాణమయ్యాడు !

★ ★ ★

వెంకటయ్య డబ్బు తెచ్చిన రోజున గోపన్న యింట్లో లేడు.

ఊరు వదిలి యాత్రలకు పోయా డన్నారు. విధవ కూతురే వచ్చి తలుపు తీసి వెంకటయ్యను గుర్తుపట్టింది.

'అమ్మా, అలనాటి అప్పు సంబంధించి మా అయ్య సచ్చిపోయే దాకా పోరుపెట్టాడు. తమ రుణం వుంచుకోకూడదనిపించి యీ ఏడాది పంట అమ్మేసాను. పాతగడ్డివామీ, దున్న కుర్రనూ తెగనమ్మితే యింతవరకూ వచ్చింది అసలేమిటో వడ్డీ ఏమిటో యింతటితో సరి. రుణాను బంధం తెంచేసుకోండి". అన్నాడు ఆ మాటలు విన్న గోపన్న కూతురు చేతులు జోడించి

'అయ్యా లెక్కలు తీసే పరిస్థితిలో లేను. తమ్ముడి దయ మీద బతుకు తున్నాను. చేతిలో దుమ్మిడీలేక పిల్లలకు గుడ్డ ముక్క కుట్టించుకోలేకుండా ఉన్నాను. ఈ పెల్లెలికాపురం నిలబెట్టటానికి దేవుడు నీతో పంపించిన సాయం అనుకుంటాను. ఈ మజ్జిగనీ త్రాగు ఎండన పడొచ్చావు" అంది. ఎత్తి పట్టుకుని త్రాగి గ్లాసు అరుగు మీద పెట్టి తిరుగు ప్రయాణమయ్యాడు.

★ ★ ★

సీతారావుడు చావిట్లో గడ్డి మీద చచ్చిన వాడిలా పడుకుంటూ కొంత కాలం గడిపాడు. అనక రాత్రిళ్ళు ఓజాము గడిచిన పిదప లేచి బయటకు పోయేవాడు. రోడ్ను మీద తెలిసిన వాళ్ళు కూడా గుర్తు పట్టలేక పోయేవాళ్ళు. పెరిగిన జుట్టూ గడ్డం చినిగిన చొక్కాతో వ్రక్కూరునుంచి అడుక్కోవటానికొచ్చిన బిచ్చగాడనుకునేవాళ్ళు. రాత్రిళ్ళు గడ్డి మీదున్న పంచెను చూసి సీతారావుడేననుకునే వాళ్ళు యింట్లో వాళ్ళు. ఒక వేళ మనిషి లేడని యింట్లో వాళ్ళు గ్రహించినా ఎటు పోయాడని ఆరా తీయటం తగ్గిపోయింది. అతని మానాన్న అతన్ని వదిలేసారు.

అప్పటికి కొన్ని నెలల క్రితం, ఓ రోజు సాయంత్రం చీకటి పడిన కాసేపటికి పాంటూ లాల్చీ వేసుకున్న ఓ యువకుడు సిగరెట్ త్రాగుతూ పల్లెలోకొచ్చాడు. అప్పల్రావుడి యిల్లెక్కడని అడిగాడు.

అల్లదే అని చెప్పారు కుర్రవాళ్ళు. ఆ యువకుడు వచ్చే సరికి ముసలమ్మ పొయ్యి దగ్గర మండని కట్టెల నూదుతుంది. వెంకటయ్య భార్య

'ఎవరు కావాలి బాబూ' అనడిగింది.

'సీతారావు డెక్కడున్నాడు' అనడిగాడు. సిగరెట్ నేలకేసిరాస్తూ.

'అడుగో బాబూ. సావిట్లోగేదెల మద్దెగా గడ్డి మీద పడుంటాడు. పలకరిత్తే మాట్టాడ్డు. తమరికేవిటవసరం ?' కోడలు !

'పనుంది ..'

అప్పటికింకా ఊళ్ళోకి లాస్టు బస్సు రాలేదు. ఊరి కొట్ల దగ్గర జనం పలచబళ్ళేదు. పల్లెలో పంటలు పూర్తి కాలేదు. పొలం నుంచి వచ్చిన కూలీలు ఉడుకు నీళ్ళు కట్టించుకుని స్నానాలు చేస్తున్నారు. కొందరు గొడ్లకి నీళ్ళు పెట్టి లోన కట్టివేస్తున్నారు. పాడి గేదెలకు పాలు తీసేవాళ్ళు వెన్నుల మీద సవరదీస్తున్నారు. దోమలకు గేదె కదలకుండా ఆడవాళ్ళు గుడ్డల్తో విసురుతున్నారు. పల్లెలో రేడియో 'వార్తలు చదువుతున్నది. జమ్మల మడక మంగమ్మ' అంటూ రోజూ వచ్చే ఆడ మనిషి గొంతుతో పలుకుతుంది.

మాల పల్లెలో యిటీవల అయిదారుగురు కుర్రవాళ్ళు రేడియోలు కొనుక్కుని పాటలు పాడించుకుంటున్నారు. పల్లెలో పెట్టిన స్కూలుకు ఇద్దరు హరిజన టీచర్లను వేసారు. వారిద్దరితో పాటు వి.యల్ డబ్ల్యూ, మార్తమ్మ కూడా పల్లెలోనే వుంటుంది. పల్లె నుంచి పది మంది కుర్రవాళ్ళూ, ఆడపిల్లలూ హైస్కూల్లో చదువుతున్నారు. ఒకరిద్దరు శ్రీకాకుళం కాలేజీలో పై చదువులకు చేరారు. ఊరి బస్సుల్లో ఒకటి రెండు ట్రిప్పులు పల్లె లోపలి దాకా వస్తున్నాయి.

కొత్త సంవత్సరం పండక్కి పల్లెలో కుర్రవాళ్ళంతా తలో రూపాయి వేసుకుని బంతి భోజనాలు చేస్తారు. ఆ రాత్రి స్టేజి కట్టుకుని నాటకాలు, డాన్సులు వేస్తుంటారు. ఊరి నాయుళ్ళు ఆ పండగనాడు పల్లెలో కొచ్చి తొంగి చూసి వెళ్తుంటారు. కొందరు చందాలు కూడా యిస్తారు. అల్లా ఆ యజ్ఞం నాటి నుంచి పెద నాయుళ్ళు పల్లెలోకిరావటం తగ్గించినా ఆళ్ళ పిల్లలు అడపాదడపా వచ్చి పోతుంటారు.

అడుగో, అలాంటి నాయుడు బాబు కొడుకెవరో ననుకుంది గాని వెంకటయ్య భార్యకు అనుమానం రాలేదు.

సీతారావుడి కోసం వచ్చిన కుర్రవాడు అతన్ని లేపి ఊరు బయట శ్మశానం రేవుకు తీసుకుపోయాడు. ఓ చెట్టు క్రింద నిలబడి సిగరెట్ ముట్టించి తాపీగా "ఏమంటావ్ .. ?" అన్నాడు

" .............................. "

"సత్యం మాస్టారి పేరు విన్నావా ?'

"...... ఇన్నానండి ......"

"కైలా సంగారి పేరు "

"ఇన్నానండి.."

"ఏం నిర్ణయించుకున్నావ్ ?"

" .............................. "

"నరకవలసింది పసి పిల్లల్ని కాదు .."

" .............................. "

మౌనంగా చావిట్లో నెలల తరబడి నిద్రపోతే పిల్లవాడు బ్రతికొస్తాడనుకున్నావా? .."

" .............................. "

"నీతమ్ముడు వెంకటయ్య ఏమంటున్నాడు ?"

"అడు న్యాయుళ్ళ మాట జవదాటడు . " సీతారాముడు ..

'సరే నీ సంగతి తేల్చు. రేపు రాత్రి పదకొండు గంటలకు మండపం దగ్గరకు సత్యం మాస్టారొస్తారు .. నీవు కూడారా .."

'ఇంకా ఎవరొస్తారు .. ?'

'ఇంకా కొందరుంటారు.. నువ్వురా" అని చెప్పి ఆయువకుడు వెళ్ళిపోయాడు.

సీతారావుడు తిరిగొచ్చి తొలిసారిగా - అంటే దాదాపు రెండేళ్ళ తర్వాత 'అమ్మా' అని పిలిచాడు. అతని పిలుపు విని చాలా రోజులై నందున అలవాటు లేక ఎవరో పిలిచారనుకుని 'ఎవరూ' అంది ముసలమ్మ.

'ఇటూ .. యిటూ. నేను' సీతారావుడు

'అయ్యా - సీతయ్యా .. నువ్వా .. ఇన్నాల్టికి నోరు పెగిలిందా .. నా తండ్రో .. ఏందయ్యా .. ఏం కావాలి .. సెప్పు .. !

'ఆకలేస్తంది .. '

'అట్టాగే .. పప్పు చారుంది. కాల్చిన ఎండు చేపముక్కుంది. ఉల్లిపాయ పెడతా.. కడుపు నిండాతినయ్యా.. సచ్చిపోయి నోళ్ళని

కలుసుకుని అట్టా రాయీ రప్పాలాగా పడుంటామా' ముసలమ్మ.

సీతారావుడు కడుపునిండా అన్నం తిన్నాడు.

మరురోజు రాత్రి పది గంటల తర్వాత తండ్రి అప్పుల్రాముడి చేతి కర్ర .. ఆయన చచ్చిపోయిం తర్వాత మచ్చు మీద పడుంది. లాగి క్రిందికి దించాడు. రాయి మీద టక్కు టక్కున కొట్టాడు.

'కర్రెందుకయ్యా' ముసలమ్మ !

'పొలం పోతన్నా - పురుగూ పుట్టా వుంటాయనే ..'

'మానాయనే .. యిన్నాళ్ళకి పెపంచంలో కొచ్చావా నాయినా' అనుకుంది ముసలమ్మ.

'అయ్య.. ఇంద మొక్కజొన్న కండె. యిందాక కాల్చా .. సచ్చే లోకానున్నాడో.. మనవడు పగిడయ్య.. కండెంటే గంతు లేసేవాడు .. తీసుకెళ్ళి పొలం మీద తినయ్యా ..' అంది ముసలమ్మ.

సీతారావుడు కదిలిపోయాడు. మళ్ళీ రానే లేదు . !

★ ★ ★

స్వయానా బావమరిది అయిన లక్షుం నాయిడి హత్య కేసును జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీరాములు నాయుడు తీవ్రంగా పరిగణించ లేదు. యజ్ఞం జరిగిన నాటి నుంచీ శ్రీకాకుళం లోనే ఉంటున్న శ్రీరాములు నాయుడు సుందర పాలెం సకృత్తుగా తప్ప రావటం లేదు. ఊరి సర్పంచ్ పదవి సూర్యానికి లభించింది. వెంక టయ్య 'హరిజన' మెంబరుగా పంచాయితీలో ప్రవేశించాడు. అలా చేయమని సూర్యానికి శ్రీరాములు నాయుడే సలహా యిచ్చాడు. సర్పంచ్ సాలీలకివ్వటం రాజకీయంగా ఉచిత మని చెప్పి సబదాయించాడు !

లక్షుం నాయుడి హత్యలో ఊరు దద్దరిల్లినా శ్రీరాములు నాయుడు చలించలేదు. తాను చచ్చి తన ప్రాణం దక్కించాడని అతని అంతర్వాణి బోధించింది.

గత రెండేళ్ళుగా శ్రీకాకుళం, విశాఖ పట్నం జిల్లాలు అప్పటికి పోతున్నాయి. అడవుల్లో ఎర్రపూలు పూస్తున్నాయి. కండబలం, డబ్బు బలం ఉన్న వారి గుండెల్లో రైళ్ళు పరుగెత్తు తున్నాయి. సీతారాముడు వాళ్ళతో కలిసాడని తెలిసిన నాటి నుంచీ శ్రీరాములు నాయుడికి నిద్ర పట్టటం లేదు.

పేదలకు భూములు, అప్పుల బ్యాంకులు, గిట్టుబాటు ధరలు, విద్యుద్దీపాలు, రోడ్లు, మురుగు దొడ్లు, మురికి కాల్వలు అంటూ అభివృద్ధి వలుకులు రామనామంలా జపిస్తున్నాడు. వెధవది ఏ ఎమ్మెల్యేల్లోనే అయితే హైద్రాబాదు హోటేల్లో పడుకొని కాలం లాగించేయవచ్చును. ఈ పదవి ఓ దరిద్రపు ముండాకోరుది. రోజూ శ్రీకాకుళంలోనే తగలడాలి. మురపాక, రణస్థలం, కురపాం, పార్వతీపురం అంటూ అస్తమానూ యీ ఊళ్ళ లోనే తిరుగుతుండాలి. ఊళ్లలో చూడపోతే పరిస్థితులేం బాగాలేవు. అక్కడాకామందు యిక్కడీ బుగతా పైనలా అంటున్నారు. తన కూడా హెచ్చరికలు రానే వచ్చాయి.

వచ్చిన వెంటనే బామ్మరిది లక్షుం నాయుడికి కబురంపాడు -

'జాగ్రత్తగా ఉండమనీ.. వాళ్ళొస్తే మాట మీరొద్దనీ.. బీదా బిక్కీ తరుపునే ఉన్నట్లు మెసులుతుండమనీ ' కబురు పంపారు.

లక్షం నాయుడు తనని కలిసినపుడు ఆ కబురు తేల్గ్గా కొట్టిపారేసాడు.

'ఎవరొస్తారో రానియ్. బావా.. లంజాకొడుకుల్ని నరుకుతాను. తుపాకీ లైసెన్సు తెప్పించు. చెబుతా కథ"" అన్నాడు.

శ్రీరాములు నాయుడు కస్సుమని లేచి

'ఏట్రా బామ్మరిదీ.. బుర్రుండే మాట్లాడుతున్నావా. అళ్ళతో పేచీ అంటే అప్పుల్రాముడితో జెట్టే అనుకున్నావేటి ? పాటేలులా ముందు కురికేస్తున్నావ్ .. అసలే మన కుటుంబం మీద ఆళ్ళ కన్ను పడిందంటే యినిపించుకోవేంటి ?'

"ఏంటి బావా. జడిసిపోతన్నావ్ .. నా కొడుకులు నాయుళ్ళ మీద కొచ్చి బతగ్గలారా నరికిపోగు లెడతాను ! లక్షుం నాయుడు !

"ఏటి ? అల్లా ఆ ఊళ్ళల్లో తలలు తీసి నోళ్లు నాయుళ్ళు కాదేట్టి ?" శ్రీరాములు..

'నువ్వా తుపాకీ లైసెన్సు తెప్పించు. ఎవడొస్తాడో చూస్తాను.' లక్షుం నాయుడు అచ్చం ఎర్రగుర్ర మీద ఎగబర్ర పొట్టేలులానే వున్నాడు. అల్లా ఆ క్షణంలోనే నలుగురూ వింటుండగా

'ఏందయ్యా యీరితంతు .. మీరైనా చెప్పండి. మన కంటే చట్టాలున్నాయి. కోర్టు లున్నాయి. .ఆళ్ళంటే దారి తప్పిన తమ్ముళ్ళు .. మనం తిరిగి తుపాకీ పట్టుకుని 'పెతి హింస' అనటం మన తత్వానికి విరుద్ధం అంటున్నాను. శాంతి కోరుకునే తత్వం మనదీ.. మన పార్టీది. అవతల గాంధీ గారి సిద్ధాంతం కూడా అదే. మరి యీడిలా పేట్రేగి పోవటం ఏ పక్కీలో చూసినాని ప్రజా తత్వానికి విరుద్ధమంటున్నాను' ' అని ఉపన్యసించాడు.

'ఈ బావ ఉత్త పిరికినంజికొడుకు' అనుకున్నాడు లక్షుం నాయుడు.

★ ★ ★

ఆ మధ్య మరో సంగతి జరిగింది.

లక్షుం నాయుడి కూతురు సమర్త బంతికి శ్రీరాములు నాయుడు జీపులో దిగాడు. సుందర పాలెం జనం యావత్తూ భోజనాలకు తరలివచ్చారు. ఊరి జనం భోజనాలయిం తర్వాత మాల మాదిగలు తినటం పరిపాటి. పప్పన్నం అంటే ఆశపడిన పిల్లలూ, ముసలి వాళ్ళూ ఊరి జనం తిన్నదాకా ఆగలేక ఎగ బడ్డారు. చిన్నపాటి దొమ్మీ జరిగింది.

దీనికి ఆగ్రహించిన లక్షుం నాయుడు పందిట్లో మాలల పిల్ల వాణ్ణీ, ఓ మాదిగ ఆడ కూతుర్నీ రెండిచ్చుకున్నాడు. రసాభాసయ్యింది. మాల మాదిగలు కించపడి దూరంగా పోయి కూర్చున్నారు. జీపు దిగిన బావ గారికి వెదక బోయిన తీగె కాళ్ళకు తగిలినట్లయింది.

శ్రీరాములు బాబు ముందుకొచ్చాడు. "సోదరీ సోదరులారా క్షమించాలి. లక్షుం నాయుడి ప్రవర్తన నాకేం నచ్చలేదు. నాకు బంధువైనా బంతిలో బలపక్షం సహించను. మీరంతా తిన్నదాకా నేను మంచి నీళ్ళు ముట్టను.." అని పిలుపిచ్చాడు.

లక్షుం నాయుడి కొళ్ళు మండి

"నువ్వు కూడా మాలమాదిగల్ల చేరిపోయావేటి ? రాను రాను నీకు మతి పోతూ వుంది. ఆ లంజకొడుకుల్ని నువ్వు సబదాయించే దేటి ?" 'నోర్మూయ్ - యీ ఒళ్ళు బలసిన ప్రవర్తన నాకు నచ్చదు. మాట

మీరితే సెంపగల గొట్టగలను.."

"ఏదీ కొట్టు సూద్దాం"

లక్షుం నాయుడి చెంపఛెళ్ళుమంది అతను ఆగ్రహంతో ఒక్క తోపు తోసాడు. శ్రీరాములు తూలి పందిరి గుంజ మీద పడగా చిన్న వానం పెచ్చు గీసుకుంది.

'ఏట్రా .. ఏట్రా .. సంపేస్తావేట్రా .. కూలీనాలీ జనమంటే కుక్కలను కొంటున్నా వేంటి ..? తుపాకీ లైసెన్సు యిప్పించ మన్నావు ... ఇందుకేనేంటిరా .. ఈళ్ళను కాల్చిపారేసా వేంటిరా. రా యిప్పిస్తాను. ఎలా కాలుస్తావ్. ఎవర్ని కాలుస్తావో "గొంతెత్తి అరిచాడు !!

తుపాకీ .. కాల్చటం ..లైసెన్సు.. అనే మాటలు ఊరు ఊరంతా మ్రోగేటట్లు అన్నాడు బావగారు! ఊళ్ళమీద నుంచి కొండల మీద ప్రతిధ్వనించాయి. వీడితో ఈ రోజు నుంచీ నా సంబంధాలు పటా పట్.. బంద్ ! అన్నాడు శ్రీరాములు బాబు సర్వజనుల ముందూ ..

'ఏటి మా బావ పిరికి నంజకొడుకై పోయాడు' అన్నాడు బావమరిది.

అంతా ముక్కు మీద వేలేసుకున్నారు !

లక్షుం నాయుడిదే తప్పని ముక్త కంఠంతో పలికారు.

మరి కొన్నాళ్ళకే లక్షుం నాయుడి తల ఉట్టి కెక్కింది !

★ ★ ★

ఒక యింట్లో రెండు ప్రాణాలు పోవని శ్రీరాములు నాయుడికి నమ్మకం కుదిరిన తర్వాత మనస్సు కుదుట పడ్డది !

హత్యలో సీతారావుడి పాత్ర వుందని తెలిసి పోలీసులు అతని కుంటుంబాన్ని ప్రశ్నించటాని కొచ్చారు.

శ్రీరాములు నాయుడు ససేమిరా అంగీకరించలేదు.

"ఈ వెంకటయ్య నా మనిషి. ఈ కుటుంబం నాది. తరతరాలుగా వీళ్ళు నా వాళ్ళు. చేతనైతే సీతారావుణ్ణి పట్టుకోండి. లేకపోతే చేతులు ముడుచుకుని అవతలకు పొండి. ఇప్పటికే ఈ ఊరు చాలా బలిపెట్టింది. ఇక చాలు"

అన్నాడు పరమశాంత మూర్తీ, ప్రజాహితుడూ శ్రీరాములు బాబు !

★ ★ ★

చుట్టు ప్రక్కల గ్రామాల్లో వెంకటయ్యకు మంచి పలుకుబడి వచ్చింది. 'అంతా వాళ్ళయ్యరక్తం .. నీతి మంతుడు.. నికార్సయిన మనిషి .. శ్రీరాములు బాబుకు కుడిభుజం" అనుకుంటున్నారు.

శ్రీరాములు బాబు చిరకాల వాంఛ నెరవేరి ఎమ్మెల్యేగా ఎన్నికై పూలదండల్తో ఊరేగింపుగా తిరిగి హైద్రాబాదు బయలు దేరే ముందు అనుయాయి లొకరు కారు దగ్గరకు పరుగెత్తుకొచ్చి 'సీతారావుడు అయిపోయాడట. మొన్న దొరికాడట. నిన్న పని పూర్తి చేసామని డీయస్పీ కబురు చేసాడు" అని చెవిలో చెప్పాడు.

శ్రీరాములు నాయుడు కారులో నుంచి ఒకర్ని దింపి 'వెంకటయ్యను నా కారులో ఎక్కమనండి' అని పురమాయించాడు. కారు జాతీయ రహదారెక్కి రాజధానివేపు పయనించింది.

❖



30-3-96న కాకినాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ప్రముఖ రచయిత " శ్రీకంఠస్ఫూర్తి" కథల సంపుటి 'అమృత వర్షం' ఆవిష్కరణ సభలో ... (ఎడమనించి) పి. చంద్రశేఖర అజాద్, కథా సంపుటి రచయిత శ్రీ కంఠస్ఫూర్తి, ఆవిష్కర్త డా॥ సోమ సుందర్, శ్రీరసరాజు, శ్రీ అద్దేపల్లి, డా. మిరియాల రామకృష్ణ, కార్యదర్శి చొక్కర తాతారావు ప్రభృతులు ఉన్నారు.